క్లుప్తంగా

చేతివృత్తులతో మహిళలకు ఆర్థిక భరోసా



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

రామచంద్రాపురం: మహిళలు చేతివృత్తుల ద్వారా ఆర్థిక భరోసా పొందవచ్చని రాస్ పొదుపు సంఘాల సంచాలకుడు నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణకాల్వలో రాస్ పొదుపు సంఘాల సభ్యులకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు 4 నెలలపాటు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చేతివృత్తులు నేర్చుకుని బ్యాంకు ద్వారా రుణాలు పొంది చిన్న యూనిట్లు స్థాపించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రాస్ సిబ్బంది నాగేశ్వర్‌రావు, మునిరాజ, లావణ్య, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న అధికారులు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సొసైటీ ఫర్ సోషియల్ సర్వీసు సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి జిల్లా డీవైఈఓ బాలాజి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంఈఓలు మార్కొండయ్యనాయుడు, జయవేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, రైటింగ్ ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు అందించారు. అనంతరం సొసైటీ ఫర్ సోషియల్ సర్వీసు సంస్థ కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పదిహేనేళ్లుగా తమ సంస్థ ద్వారా విద్యాసామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుజనాకుమారి, ఉపాధ్యాయులు, సొసైటీ ఫర్ సోషియల్ సర్వీసు సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళలే కీలకం



గిరిజను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

తిరుపతి సిటీ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తిరుపతి రక్షక్ అదనపు ఎస్ఐ ఎస్.గిరిజ అన్నారు. గురువారం స్థానిక కరకంబాడిరోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో మహిళా శక్తి అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలు కుటుంబశ్రేయస్సుతో పాటు దేశ శ్రేయస్సుకోసం పాటుపడుతున్నారని కొనియాడారు. మహిళా శక్తి దేశానికి ఎంతో అవసరమన్నారు. ఆధునిక ప్రపంచంలో మహిళల రక్షణపై ప్రభుత్వాలు తీసుకుంటున్న రక్షణ చర్యలపై ప్రతి విద్యార్థిని అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథిని కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తారకేశ్వర్, కె. రేణుక, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరతో మానవాళికి రక్షణ



వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల: ప్రకృతిలో సమస్త మానవాళికి ఓజోన్ పొర రక్షణగా ఉందని ఎంఈఓ బాబ్జి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓజోన్ డే సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా మనపై పడకుండా ఓజోన్ పొర ఒక గొడుగులా కాపాడుతోందని తెలిపారు. కాలుష్యం కారణంగా ఓజోన్ పొర దెబ్బ తినకుండా కాపాడాలని తెలిపారు. మానవాళి సంరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి ఓజోన్ పొరను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు జయచంద్ర, కొండయ్య, ధర్మేంద్ర, నాగేంద్ర, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఫేషియల్ చేస్తున్న టెక్నీషియన్



చేతికి మెహందీ పెడుతున్న టెక్నీషియన్

అందమే ఆనందం

అందం గురించి ఒక్కో సినీ కవి ఒక్కో విధంగా వర్ణించారు. ఒకరు 'అందమే ఆనందం' అంటే మరొకరు 'అందం అంటే ఆడది' అంటూ మగువుల అందచందాలను ఆకాశానికెత్తారు. ఎవరెలా నిర్వహించినా అందం ప్రస్తావన వస్తే ఆడవాళ్లను విస్మరించలేమనేది యథార్థం.

- అందచందాలపై మగువుల మక్కువ
- బాహ్యసౌందర్యం కోసం భారీగా వ్యయం
- బ్యూటీపార్లర్ల వైపు నగర మహిళ చూపు

తిరుపతి గాంధీరోడ్డు: తిరుపతి నగరంలో ఎంతో వేగంగా నగర మహిళల సౌందర్యాభిరుచి పెంపొందుతోంది. బాహ్య సౌందర్యం కోసం భారీగానే వెచ్చిస్తున్నారు. అందుకే ఇక్కడ బ్యూటీపార్లర్ లేని వీధి లేదంటే అతిశయోక్తికాదు. హెయిర్, స్కిన్‌కేర్ విషయంలో నగర మహిళలు కనబరుస్తున్న శ్రద్ధను గమనిస్తే కొద్దిరోజుల్లో 'ఆంధ్రా ప్యారిస్'గా తిరుపతి పేరుగడిస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. ఒకప్పుడు మెట్రోపాలిటన్ నగరాలు, ఇతర పెద్ద నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే భారీస్థాయి బ్యూటీపార్లర్లు, తిరుపతి నగరంలోనూ పదుల సంఖ్యలో దర్శనం ఇస్తున్నాయి. బ్యూటీపార్లర్లు అయితే లెక్కేలేవు. 400కు పైగా ఉన్నట్లు ఓ అంచనా. అందం విషయంలో మహిళలు పెద్ద నగరాలకు దీటుగా ప్రాధాన్యత ఇస్తుండడంతో తిరుపతిలో బ్యూటీ పార్లర్ల వ్యవస్థ వేగంగా అభివద్ధి చెందుతోంది. మగవాళ్లు సైతం హెయిర్, స్కిన్ కేర్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండడం గమనార్హం.



నలుగు నుంచి పార్లర్ దాకా

పూర్వం ప్రతివారంలో మహిళలు రెండుసార్లు చర్మానికి నలుగు పెట్టుకునేవారు. నేటి యుగంలో పార్లర్లను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని అనేక రకాల హెర్బల్ ఉత్పత్తులు మార్కెట్లోకి వచ్చాయి. బ్యూటీషియన్ సలహాతో వీటిని వినియోగిస్తే మంచి ఫలితం ఉంటుందనేది చాలా మంది అభిప్రాయం. అందుకే తప్పనిసరిగా బ్యూటీ పార్లర్లలను ఆశ్రయిస్తున్నారు.

ఆకర్షణీయంగా ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందట

ఆకర్షణీయంగా ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పలువురు మహిళల అభిప్రాయం. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ కోసం అందంగా ఎవరికి వారు లైఫ్‌స్టైల్‌కు అనుగుణంగా బాహ్య సౌందర్యం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారు. హెయిర్ స్టైల్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. బ్యూటీ పార్లర్ ద్వారా స్కిన్‌కేర్, హ్యాండ్, ఫుట్‌కేర్, హెయిర్ డిజైనింగ్, హెయిర్ ట్రీట్‌మెంట్, ఫేషియల్, ఐబ్రోస్, బాడీస్పా అనేకమైన రకాలు ఉన్నాయి.

ప్యాకప్ లేని మేకప్

మేకప్ విషయంలో స్త్రీ, పురుషులు విపరీతమైన శ్రద్ధ కనబరుస్తున్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా వివిధ వేడుకల మేకప్‌లకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇక వివాహ వేడుకల విషయంలో బ్యూటీషియన్ సలహాలు పాటిస్తున్నారు. శుభకార్యాలప్పుడు బ్యూటీషియన్‌నే అందుబాటులో ఉంచుకుంటున్నారు.

బిజీలైఫ్‌తో సమయం ఆదా



ప్రస్తుతం ప్రతి విషయంలో బిజీ జీవితాన్ని గడపాల్సి వస్తుంది. అందుకే అప్పుడప్పుడు అందాలకు మెరుగులు దిద్దుకునేందుకు ఇలా ఆటవిడుపుగా వస్తుంటాం. ఇలా వచ్చినప్పుడు చాలా సంతోషంగా వుంటుంది.

- సంయుక్త

ఫేషియల్ మంచి వ్యాయామం



ఫేషియల్ ముఖానికి మంచి వ్యాయామం. చేతులతో ముఖంపై రుద్దినప్పుడు కండరాలకు ఉత్తేజాన్ని ఇస్తుంది. దీనివల్ల మెదడు చాలా రిలాక్స్‌డ్‌గా వుంటుంది. అందుకే బ్యూటీపార్లర్‌కు వస్తుంటాను.

- భాగ్యలక్ష్మి

మంచి ఉపాధి..



బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవడం వల్ల మంచి ఉపాధి లభించింది. వచ్చే వినియోగదారులతో సరదా సరదాగా గడుపుతూ ఆనందంగా ఉంటాను. అవసరానికి తగిన డబ్బులు కూడా వస్తాయి. యువతులకు ఇది ఒక మంచి ఉపాధి.

– లావణ్య, టెక్నీషియన్

సౌందర్య పరిరక్షణకు ప్రాధాన్యం..



తిరుపతి నగర ప్రజల జీవన శైలిలో చాలా మార్పులు వస్తున్నాయి. ప్రజలు చాలా విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆరోగ్యం కాపాడుకునేందుకు ఆహార విషయంలో కేర్ తీసుకున్నట్టుగానే సౌందర్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

శ్రీవాణి, బ్యూటీషియన్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



ఎస్టీఓకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

పాకాల: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రరాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం పాకాల యూనిట్ సభ్యులు ఎస్టీఓ జ్ఞానప్రసన్నకు వినతి పత్రాన్ని సమర్పించారు. గురువారం కోఆర్డినేషన్ సమావేశంలో భాగంగా వారు మాట్లాడారు. ఫ్యామిలీ పెన్షనర్ల పుట్టిన తేదీలు పీపీఓలో లేకపోవడంతో 70 సంవత్సరాలు పైబడినవారు కొంత మంది అడిషనల్ పేమెంట్ పొందలేకపోతున్నారని తెలిపారు. పెన్షనర్లకు చెల్లించాల్సిన అన్ని డీఏలు, 11వ పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షనర్లకు ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాంనాయుడు, పాకాల యూనిట్ అధ్యక్షుడు కుప్పుస్వామినాయుడు, కోశాధికారి కె.రామమూర్తి, అబ్దుల్ గఫూర్, రామయ్య, పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

వ్యాపారుల వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న చిరువ్యాపారులు, నేతలు

తిరుపతి(అలిపిరి): చెవిలో పూలు, నుదుటిపై మూడు నామాలు, మెడలో మాల, చేతిలో భజన తప్పట్లు పెట్టుకొని వినూత్న రీతిలో గురువారం శ్రీవారి మెట్ల వ్యాపారులు టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ శ్రీవారి మెట్ల వ్యాపారుల సమస్యలపై గత 23 రోజుల నుంచి నిరసన తెలుపుతున్నా టీటీడీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శ్రీవారి మెట్ల వ్యాపారులపై టీటీడీ అధికారులు కఠినంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. తక్షణమే వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేతలు, చిరువ్యాపారులు చిట్టిబాబు, మధు, రామ్మూర్తి, ప్రకాష్, చిరంజీవి, మల్లికార్జున, పెంచలయ్య, సోను, గణేష్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సునీల్

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుపేట గ్రామంలోని రైతులకు ఉద్యానశాఖ అధికారి సునీల్ ఆయిల్ పామ్ సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక హెక్టారుకు 143 మొక్కలు ఒక్కొక్కటి రూ.193 చొప్పున 100 శాతం రాయితీతో అందిస్తోందని తెలిపారు. ఈ పంట నాలుగో సంవత్సరం నుంచి చేతికి వస్తుందని, గెలలను 3ఎఫ్ కంపెనీ ప్రభుత్వం సూచించిన మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని, ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు రైతులు తమ గ్రామ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు

- ఏచూరి సంతాప సభలో వక్తల సంతాపం



సంతాప సభలో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి కల్చరల్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం, దేశానికి, అభ్యుదయ ఉద్యమానికి, వామపక్షాలకు తీరనిలోటని వామపక్ష పార్టీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. యశోదానగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కందారపు మురళి అధ్యక్షతన గురువారం ఏచూరి సీతారాం సంతాప సభ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చిన్నం పెంచలయ్య, ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, సీనియర్ జర్నలిస్టు రామచంద్రారెడ్డి హాజరై ఏచూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఉద్యమస్ఫూర్తిని కొనియాడారు. రానున్న మూడు రోజులు సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన అన్ని కార్యక్రమాలను రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ఏచూరి మృతికి సంతాపంగా సీపీఎం శాఖలు సంతాపసభలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని నేతలు పిలుపునిచ్చారు.

సీతారాం ఏచూరి గొప్ప మేధావి

తిరుపతి(అలిపిరి): సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని నష్టమని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీతారాం ఏచూరి గొప్ప మేధావి.. పేదల పక్షపాతి.. మంచి వక్త.. పోరాట యోధుడన్నారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడని, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఉన్నప్పటికీ అత్యంత సాదాసీదాగా.. నిరాడంబర జీవితం గడిపేవారని తెలిపారు. కమ్యూనిస్ట్ భావజాలంతో నిరంతరం ప్రజల సమస్యలపై కొట్లాడిన ప్రజానాయకుడని కొనియాడారు. ఆయన్ను ఢిల్లీ ఎయిమ్స్‌లో 20 రోజుల క్రితం కలిసి పరామర్శించానని పేర్కొన్నారు. ఆయన మరణం దేశాభివృద్ధికి, దేశ రాజకీయాలకు తీరనిలోటని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

నిర్వాణ నవల పుస్తకావిష్కరణ సభ రేపు

తిరుపతి కల్చరల్: సమాజానికి బౌద్ధమే శరణ్యమని, బుద్ధుని జీవితంపై విశాఖకు చెందిన ప్రముఖ నవలా రచయిత, కవి డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన «నిర్వాణ నవల» పుస్తకా విష్కరణ సభ ఈనెల 14వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు దళిత సాహిత్య వికాస వేదిక జిల్లా కన్వీనర్ పి.అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కవులు, రచయితలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం వెలుపల నివేదా థామస్, నందకిషోర్ ఈమాని

తిరుమల: తిరుమల శ్రీవారిని తెలంగాణ ఎమ్మెల్యే బాబునాయక్, 35 చిన్న కథ చిత్ర కాదు చిత్ర యూనిట్ నివేదాథామస్, విశ్వదేవ్ దర్శకుడు నందకిషోర్ ఈమాని గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

వర్సిటీ అభివృద్ధికి సలహాలు అవసరం



మాట్లాడుతున్న వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ అభివృద్ధికి రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలు ఎంతో అవసరమని వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. గురువారం వర్సిటీ సెనేట్ హాల్‌లో రిటైర్డ్ నాన్ టీచింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధిలో రిటైర్డ్ ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. నేటి యువత పెడదారిన పడకుండా విద్యార్థుల ఉన్నతి తమ వంతు సూచనలు ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, సెక్రటరీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సెల్ఫ్ కాంట్రిబ్యూషన్ ద్వారా రిటైర్డ్ ఉద్యోగులు ప్రతినెలా రూ. 2వేలు చెల్లిస్తామన్నారు. వర్సిటీ అధికారులు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమాన్ని ఆకాంక్షించి ఆ నిధులను సంరక్షించి మరణించిన రిటైర్డ్ ఉద్యోగికి రూ. 50వేల చొప్పున అందించాలని కోరారు. అనంతరం 40మంది రిటైర్డ్ ఉద్యోగులను ఆయన ఘనంగా సన్మానించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, అసోసియేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

తిరుపతి సిటీ: విద్యార్థినులు మానసిక ఒత్తిడికి గురికారాదని హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ ఆస్పత్రి న్యూరో సైకాలజిస్ట్ డాక్టర్ హేమలత సూచించారు. గురువారం పద్మావతీ మహిళా వర్సిటీ క్లినికల్ సైకాలజీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మహత్య నివారణ వారోత్సవాలలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు, నివారణా చర్య లపై విద్యార్థినులకు ఆమె పలు సూచనలు చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, డీన్ కాత్యాయని, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే మహి ళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సూసైడ్ ప్రివెన్షన్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల చేత సూసైడ్ ప్రివెన్షన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు మాధవి, అనిత పాల్గొన్నారు.

శ్రీరాములురెడ్డి లేని లోటు తీర్చలేనిది



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



శ్రీరాములురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి

- నివాళులర్పించిన చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సాయినగర్ ఎంపీటీసీ తాతిరెడ్డి శ్రీరాములురెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన శ్రీరాములురెడ్డి మృతదేహానికి లింగేశ్వరనగర్‌లోని ఆయన ఇంటి వద్ద గురువారం లక్ష్మి, తిరుపతి రూరల్ ఎంపీపీ వేముల యశోద, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు నివాళులర్పించారు. పార్టీకి, గ్రామాభివృద్ధికి శ్రీరాములురెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఉమ్మడి సాయినగర్ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఆయన ఎంతగానో పాటుపడ్డారని గుర్తు చేసుకున్నారు. చివరి వరకు ప్రజలకు సేవ చేస్తూ, ప్రజాప్రతినిధిగానే ఆయన కన్నుమూశారని ఎంపీపీ యశోద కొనియాడారు.

మోహిత్‌రెడ్డి పరామర్శ

సాయినగర్ పంచాయతీకి చెందిన ఎంపీటీసీ తాతిరెడ్డి శ్రీరాములురెడ్డి ఆకస్మికంగా మృతిచెందారు. గురువారం సాయంత్రం శ్రీరాములురెడ్డి ఇంటికి చేరుకున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శ్రీరాములురెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. శ్రీరాములు రెడ్డి మంచితనం, సేవాతత్వం ఎన్నటికీ మరువలేమన్నారు. తమ కుటుంబసభ్యులు తోడుగా వుంటామని హామీ ఇచ్చారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ

తిరుపతి రూరల్: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ అన్నారు. శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం, హోమ్ సైన్స్ విభాగం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం అవిలాల ప్రభుత్వ పాఠశాలలో 'ప్రతి ఒక్కరికి పోషకాహారం' అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారాలు, జంక్ ఫుడ్ మధ్య తేడాలు, అసమతుల్య ఆహారంతో కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కడుపులో పుండ్లు, జీర్ణ సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గడం విషయాలను తెలియజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పోస్టర్లు, నమూనాలు, రోల్ ప్లే, బొమ్మల ప్రదర్శన ద్వారా స్కూల్ పిల్లలకు సంతులిత పోషణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీగా హేమ



నియామకపత్రాన్ని అందుకుంటున్న హేమ

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మెకానికల్ విభాగం హెచ్‌ఓడీగా ప్రొఫెసర్ పి హేమ నియమితులయ్యారు. ఈమేరకు వీసీ సీహెచ్ అప్పారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ మెకానికల్ విభాగపు తొలి మహిళా హెచ్‌ఓడీగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల శ్రేయస్సుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఉత్తర్వులను ప్రిన్సిపల్ సత్యనారాయణ చేతుల మీదుగా అందుకుని బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా శ్రీసరస్వతి మేధ్కోల గణపతి హోమం





ప్రత్యేక అలంకరణలో శ్రీశక్తి గణపతి , లక్ష మోదకాలతో శ్రీసరస్వతి మేధ్కోల గణపతి హోమం

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తిపీఠంలో శ్రీశక్తి గణపతి నవరాత్రి మహోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. గురువారం శ్రీమేధ్కోల గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతీలు పీఠంలో కొలువైన శ్రీ శక్తి గణపతి స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య పూజలు ప్రారంభించారు. వేదపండితులు లక్ష మోదకాలతో శ్రీసరస్వతి మేధ్కోల గణపతి హోమం జరిపించారు. ఆలయ నిర్వాహకులు పూజలో పాల్గొన్న భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.